ఎన్నికల సామాగ్రిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షేక్‌రిజ్వాన్ బాషా

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య 1002
- 12 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు • కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 26 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ గురువారం జరగనుంది. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 1002 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం పీవోలు 17 మంది, ఏపీవోలు 18 మంది, ఓపీవోలు 37 మంది, మైక్రో అబ్జర్వర్లు 18 మంది చొప్పున నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 12 మండలాల్లో ప్రతి 3 మండలాలకు ఒక రూట్ చొప్పున నాలుగు రూట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, నిరంతర విద్యుత్, టాయిలెట్స్, ఫర్నీచర్ వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం (పీఎస్) ఏర్పాటు చేయగా, ఇందులో అధిక సంఖ్యలో 511 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. పాలకుర్తి జడ్పీహైస్కూల్ పీఎస్‌లో 84 మంది, దేవరుప్పుల జడ్పీహెచ్ఎస్ పీఎస్ 52 మంది, కొడకండ్ల జడ్పీహెచ్ఎస్ పీఎస్ 32 మంది, తరిగొప్పుల జడ్పీహెచ్ఎస్ పీఎస్ 16 మంది, జఫర్‌గడ్ జడ్పీహెచ్ఎస్ పీఎస్ 29 మంది, బచ్చన్నపేట జడ్పీహెచ్ఎస్ పీఎస్ 70 మంది, స్టేషన్ ఘన్‌పూర్ జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పీఎస్ 67 మంది, నర్మెట జడ్పీహెచ్ఎస్ పీఎస్ 31 మంది, రఘునాథపల్లి జడ్పీహెచ్ఎస్ పీఎస్ 47 మంది, లింగాలఘనపురం 47 మంది, చిల్పూరు జడ్పీహెచ్ఎస్ పీఎస్‌లో 16 మంది చొప్పున మొత్తం 1002 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది

జనగామ కలెక్టరేట్ నుంచి బుధవారం మధ్యాహ్నం నాలుగు ప్రత్యేక బస్సుల్లో ఎన్నికల సిబ్బంది జిల్లాలోని 12 మండలాల పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. అంతకు ముందు కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ అప్రమత్తంగా ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు.

ఇండ్లు దగ్ధమవడంతో కట్టు బట్టలతో మిగిలిన బాధిత కుటుంబ సభ్యులు

వంట గ్యాస్ లీకై రెండు పెంకుటిళ్లు దగ్ధం

జఫర్‌గడ్, ఫిబ్రవరి 26 : వంటగ్యాస్ లీకై రెండు పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కోనాయిచలంలో బుధవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనాయిచలం గ్రామానికి చెందిన జోగు బాబు, జోగు రాజు అన్నదమ్ములు. వీరు పక్కపక్క పెంకుటిళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారన్నారు. ఈ క్రమంలో బుధవారం వీరి బంధువు చనిపోగా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంట్లోని వంటగ్యాస్ లీకై మంటలు అంటుకుని పొగలు రాగా చుట్టు పక్కల వారు గమనించి తలుపులు పగుల కొట్టి చూశారు. అప్పటికే మంటల వ్యాపించి ఇళ్లలోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలుసుకుని జోగు బాబు, రాజు కుటుంబ సభ్యులు ఇళ్ల వద్దకు వచ్చి జరిగిన ఘటన చూసి బోరున విలపించారు. ఈ దుర్ఘటనలో రెండు తులాల బంగారం, పది తులాల వెండి పట్ట గొలుసులు, రూ.25 వేలు నగదు, బియ్యంతో పాటు సామగ్రి, వ్యవసాయ భూమికి చెందిన పట్టాదారు పాస్‌బుక్స్ నిత్యావసర వస్తువులు దగ్ధమయ్యాయని తెలిపారు. సుమారు రూ. ఏడు లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందని, కట్టుబట్టలతో మిగిలామని బాధిత కుటుంబ సభ్యులు విలపించారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ రామస్వామి, పోలీసులు విచారణ చేపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.

NTW-326545

WANTED

jobs Apply Now!

★ లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.

NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

విద్యార్థిని ఆత్మహత్య

కాశీబుగ్గ, ఫిబ్రవరి 26 : నగరంలోని పైడిపల్లి ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కళాశాలలో ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుదవారం చోటు చేసుకుంది. ఎనుమాముల సీఐ అలె రాఘవేందర్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన గుంటోజు రేస్మిత(19) ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం తాను ఉంటున్న గది తలుపు తీయక పోవడంతో ఆమె తండ్రి గంటోజు సత్యనారాయణకు కాలేజీ సిబ్బంది సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా రేస్మిత ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉంది. మంగళవారం రాత్రి గదిలో ఒంటరిగా ఉందని, ఆమె మృతికి గల కారణాలు కనుక్కోవాలని మృతురాలి తండ్రి గంటోజు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అలె రాఘవేందర్ తెలిపారు.

పాలకుర్తిలో శివకల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

సిద్ధేశ్వరస్వామికి పూజలు చేస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

- భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- పాలకుర్తి సోమేశ్వరాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పూజలు
- సిద్ధేశ్వరుడిని దర్శించుకున్న విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే పల్లా

జనగామ (నమస్తే తెలంగాణ)/ పాలకుర్తి/బచ్చన్నపేట/జనగామరూరల్, ఫిబ్రవరి 26 : 'ఓం నమః శివాయ.. హరహర మహాదేవ శంభోశంకర' నామస్మరణతో బుధవారం శివాలయాలు మార్మోగాయి. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన పాలకుర్తి శ్రీ సోమేశ్వర స్వామి, బచ్చన్నపేట మండలం కొడ్వటూరులోని సిద్ధేశ్వరస్వామి, జనగామ మండలం చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వరస్వామి, పాతబీట్‌బజార్ శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉపవాస దీక్ష లు, జాగరణతో గడిపారు. పాలకుర్తిలోని సోమేశ్వరాలయాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివ కల్యాణానికి ముందు స్వామివారికి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఆర్డీవో డీఎస్ వెంకన్న పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. తాటిపాముల నర్సింహమూర్తి శర్మ ఆధ్వర్యంలో అర్చకులు డీవీఆర్ శర్మ, లక్ష్మణ్ణశర్మ, అనిల్, సునీల్, శ్యాం, సంతోష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జనగామ మండలం చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్ పర్సన్ ప్రేమలతారెడ్డి, మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు దర్శించుకుని పూజలు చేశారు. కొడ్వటూరు సిద్ధేశ్వరస్వామిని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని భక్తమార్కండేయ ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు దంపతులు పూజలు చేశారు.

సిద్ధేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా

కొడవటూరులోని సిద్ధేశ్వరాలయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. శివ కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈవో చిందం వంశీ, ఆలయ ప్రధాన పూజారి ఓనమఃశివాయ, నర్మెట సీఐ అబ్బయ్య, బచ్చన్నపేట ఎస్సై హమీద్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, జనగామ, చేర్యాల మా ర్కెట్ కమిటీ చైర్మన్లు బనుక శివరాజ్‌యాదవ్, నల్లనాగుల శ్వేతావెంకటాచారి, పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య పాల్గొన్నారు. చిన్నరామన్‌చర్లలోని రాజరాజేశ్వరస్వామిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో రైతుంబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చంద్రారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి : ఎర్రబెల్లి

బీఆర్ఎస్ పాలనలోనే పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన మా ట్లాడుతూ వల్మిడి, బమ్మెర, చెన్నూరు ఆలయాలను సైతం అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆలయాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తే రేవంత్‌రెడ్డి చేసిన పాపాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసినీ, డీఆర్డీవో ఎన్ వసంత, డీపీవో ఎన్ స్వరూపారాణి, ఈవోలు భాగం లక్ష్మీప్రసన్న, సల్వాది మోహన్‌బాబు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బందితో అధికారులు

దేవరుప్పులలోని పోలింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల జాబితాను ప్రదర్శిస్తున్న ఎన్నికల సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌లో ఉపాధ్యాయ ఓటర్లు 228

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 26 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నేడు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బుధవారం చేరుకున్నారు. డివిజన్ కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ పరిధిలో మొత్తం 228 ఓట్లున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో 67, పాలకుర్తి 84, కొడకండ్ల 32, జఫర్‌గడ్ 29, చిల్పూర్ మండలంలో 16 ఓట్లు ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. పీవో జగన్, ఏపీవో ప్రవీణ్‌తోపాటు పోపీవో, మైక్రో అబ్జర్వర్ ఎన్నికలను నిర్వహించనునారు. ఎన్నికల సామగ్రిని బుధవారం మూడు గంటలవరకు తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు సతీష్, శ్రీకాంత్, ఎస్సై వినయ్‌కుమార్ పోలింగ్ సెంటర్‌కు చేర్చారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం ఎన్నికలు జరుగుతన్న నేపథ్యంలో మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. నలుగురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా అభ్యర్థుల జాబితాను గోడకు అతికించారు. మండలంలో 52 ఓట్లు ఉండగా అందులో 34 మంది పురుషులు, 18 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ఓటుహక్కు ఉందని అధికారులు తెలిపారు. తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా, ఎస్సై సృజన్‌కుమార్ బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఎన్నిక ఉండగా పాలకుర్తిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ ఉపాధ్యాయులకు మొత్తం 84 మందిఓట్లు ఉన్నట్లు తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఐదుగురు రెవెన్యూ సిబ్బందిని నియమించామన్నారు.

పేలుడు ఘటన నిందితులపై కేసు నమోదు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 26 : కొత్త వాడలో పేలుడు ఘటనకు కారకులను పోలీసులు గుర్తించారు. ఈ పేలుడు బ్లాక్ మ్యాజిక్ కారణంగా జరిగిందని నిర్ధారణకు వచ్చి అందుకు గల కారకులపై కేసు నమోదు చేశారు. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. కుమారస్వామి అనే వ్యక్తికి చెందిన ఇంటి నిర్వహణ బాధ్యత మాచర్ల రాజేశ్ చూసుకుంటున్నాడు. అదే ఇంటిలో గతంలో అద్దెకు ఉన్న యాకూబ్ పాషా ఇల్లు ఖాళీ చేసి, తనకు పరిచయమున్న బాదావత్ వెంకన్నకు దాన్ని అద్దెకు ఇప్పించాడు. మంగళవారం రాత్రి దుష్టశక్తులు దరిచేరకుండా ఉండడానికి యంత్రాన్ని తయారు చేసి ఇస్తామని నమ్మబలికి విచిత్ర ఆకృతిలో ఉన్న నాణెంపై రసాయనాలు పోసి క్షుద్రపూజలు చేసినట్లు నటించి, దాన్ని ప్రత్యేకంగా ప్యాక్ చేసి రాజేశ్‌కు యాకుబ్‌పాషా, వెంకన్న అందించారు. ఈ నాణెం ఇంట్లో ఉన్నంతకాలం మంచి జరుగుతుందని, దీన్ని ఇంట్లో భద్రపరచుకోవాలని నమ్మబలికారు. వారి మాటను నమ్మిన రాజేశ్ దాన్ని ఇంట్లో భద్రపరిచాడు. అయితే, ఒక్కసారిగా నాణెం ప్యాక్ చేసిన బాక్స్ పేలి పెద్ద శబ్దం రావడంతో కంగారు పడిన రాజేశ్ వారిని వెతకగా కనిపించకుండా పోయారు. ఈ మేరకు పోలీసులకు రాజేశ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ గోపి తెలిపారు.

నాటక కళాకారులకు ప్రోత్సాహం అందించాలి

రాష్ట్ర కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 26 : కళావేదికల ద్వారా ప్రదర్శించే నాటికలు, నాటకాలు ప్రజల ఆదరణ పొందటానికి కళాకారులకు తగిన పోత్సాహం అందించాలని రాష్ట్ర కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సదానందం పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో నాటికల ప్రాధాన్యం తగ్గకుండా కళా సంస్థలు, ప్రభుత్వం తగిన చేయూత ఇవ్వాలని కోరారు. కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటులో ఎన్నో వ్యయ ప్రయాసాలకు లోనై అధికారులు, ఇంజినీర్లకు కళాకారులకు కావాల్సిన సౌకర్యాలు, వేదికను ఏర్పాటు చేయడంలో ఎంతగానో కృషి చేశామని పేర్కొన్నారు. అయితే, ప్రతినెలా తమ నాటికలు ప్రదర్శించే విధంగా కళా వేదికను ఉచితంగా అందించాలని కోరారు. అలాగే, కళాక్షేత్రంలో మరిన్ని సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాకారుల రిహార్సల్ కోసం ప్రత్యేకంగా ఒక గది, ప్రేక్షకుల కోసం టాయిలెట్స్, తాగునీటి సదుపాయం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుందావఝుల కృష్ణమూర్తి, బీ పురుషోత్తమరావు, నేలకొండ భాస్కర్‌రావు, వనం లక్ష్మీకాంతారావు, లక్ష్మణ్‌రావు, ఎస్‌వీఎన్ చారి, నాగిళ్ల రామశాస్త్రి, అంపశయ్య నవీన్, జూలూరి నాగరాజు, సీత వెంకట్, ఓడపల్లి చక్రపాణి, నృత కళాకారులు, కళాభిమానులు, సాహితీవేత్తలు, కవులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెన్ పర్సంటేజ్ ఇస్తేనే చెక్కు క్లియరెన్స్

- పైసల మంత్రి అనుచరుల 'బీ' ట్యాక్స్ దందా
- క్లియరెన్స్ కోసం రూ.30 కోట్ల విలువైన బల్దియా చెక్కులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

వరంగల్, ఫిబ్రవరి 26 : ఫిక్స్ చేసిన 'టెన్' పర్సంటేజ్ ఇస్తేనే చెక్కులు క్లియర్ అవుతాయి. ఇవ్వకపోతే నెలల తరబడి పెండింగ్‌లో ఉంటాయి. దీంతో పైసల మంత్రి అనుచరులు ఫిక్స్ చేసిన 'బీ ట్యాక్స్' ముట్టజెప్పి బిల్లులు క్లియర్ చేసుకునేందుకు కాంట్రాక్టర్లు హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు మూడు నె లల కిత్రం రాష్ట్ర ప్రభుత్వం రూ.187కోట్లు విడుదల చేసింది. వాటికి సంబంధించిన చెక్కులకు సెక్రటేరియట్‌లోని రెవెన్యూ శాఖ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. బల్దియా ఇప్పటికే సుమారు రూ.30కోట్ల పెండింగ్ బిల్లులకు చెక్కులు రాశారు. ఆయా చెక్కులను బల్దియా కాంట్రాక్టర్లు వరంగల్ ట్రెజరీలో జమ చేశారు. వాటి క్లియరెన్స్ కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే అక్కడ కాంట్రాక్టర్లకు దిమ్మ తిరిగే పర్సంటేజ్ ఫిక్స్ చేయడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రెండేళ్లు పెండింగ్‌లో ఉండడం, ఇప్పుడు బిల్లులు క్లియర్ చేసే సమయంలో పర్సంటేజ్ పేరిట పెద్ద మొత్తంలో దండుకోవడంతో కాంట్రాకర్లకు దిక్కుతోచడం లేదు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న బిల్లుల క్లియరెన్స్ కోసం మంత్రి అనుచరులు ఫిక్స్ చేసిన పర్సంటేజ్ చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. పర్సంటేజ్ ముట్టజెప్పకుంటే చెక్కు క్లియర్ చేసే పరిస్థితి లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

మంత్రి అనుచరుల దందా..

సెక్రటేరియట్‌లో పైసల మంత్రి అనుచరులు యథేచ్ఛగా బీ ట్యాక్స్ పేరిట పర్సంటేంజ్ దందా చేస్తున్నట్లు బల్దియా కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. టెన్ పర్సంటేజ్ ఫిక్స్ చేసి మరి వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ముందు చెల్లిస్తేనే చెక్కు క్లియర్ అవుతుందని బాహాటంగా చెబుతున్నట్లు సమాచారం. అలస్యం చేస్తే పర్సంటేజ్ పెరుగుతుందేమో అన్న భయంతో డబ్బులు ఇచ్చేందుకు కాంట్రాక్టర్లు హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. రెండు సంవత్సరాలుగా గ్రేటర్ కార్పొరేషన్‌లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.187 కోట్లు విడుదల చేసింది. వాటికి సంబంధించిన సుమారు రూ. 30 కోట్ల విలువైన చెక్కుల రెవెన్యూ క్లియరెన్స్ కోసం కమీషన్ చెల్లించాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అక్కడ.. ఇక్కడ మామూళ్ల పర్వం..

పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో మామూళ్ల పర్వం జోరుగా సాగుతున్నదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియరెన్స్ కోసం పెద్ద మొత్తంలో చెల్లించుకోవాల్సి వస్తున్నట్లు తెలుస్తున్నది. చెక్కులు రాసినందుకు బల్దియాలో ఫిక్స్ చేసిన పర్సంటేజ్‌తో పాటు చెక్కు క్లియరెన్స్ కోసం రెవెన్యూ శాఖలో ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో పర్సంటేజ్‌ల డబుల్ ధమాకా నడుస్తున్నది. బల్దియాలో ఉన్నత స్థాయి నుంచి కింది స్థాయి వరకు కలిపి పర్సంటేజ్‌లు ఫిక్స్ చేసినట్లు తెలుస్తున్నది. ఇలా రెండు చోట్ల పర్సంటేజ్‌లు వసూలు చేస్తుండడంపై కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అయ్యో పాపం..

- కుటుంబ కలహాలకు రెండేళ్ల చిన్నారి బలి
- పాముకాటుతో ఏడేళ్ల బాలిక..
- మరోచోట పాప కిడ్నాప్
- పండుగ పూట విషాదం

భార్యభర్తల గొడవ రెండేళ్ల చిన్నారి ప్రాణం తీసింది. మరోచోట బజారుకు తీసుకెళ్తానని నమ్మించి ఓ పది నెలల పాపను పక్కింటి వాళ్లు తీసుకెళ్లి కిడ్నాప్ చేయడం ఆచూకీ దొరకక తల్లిదండ్రులు విలవిల్లాడుతున్నారు. మరో ఘటనలో రాత్రివేళ ఇంట్లో నిద్రిస్తున్న ఏడేళ్ల బాలిక పాముకాటుకు బలైంది. వేర్వేరు చోట్ల జరిగిన ఈ మూడు సంఘటనలు పండుగ పూట తీవ్ర విషాదం నింపాయి.

ప్రగతి (ఫైల్)

జనగామ రూరల్, ఫిబ్రవరి 26 : భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా ఓ తల్లి తన రెండేళ్ల కూతురితో బావిలో దూకగా పాప మృతి చెందింది. తల్లి ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ ఘటన జనగామ మండలం గానుగుపహాడ్ శివారులోని ఏసిరెడ్డినగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏసిరెడ్డినగర్‌లో నివాసముంటున్న ఆకుల రమేశ్‌కు మూడేళ్ల క్రితం గౌరీప్రియతో వివాహం కాగా, కూతురు ప్రగతి(2) జన్మించింది. గతంలో రెండు, మూడుసార్లు వారి మధ్య గొడవలు జరగడంతో పెద్దమనుషులు సర్దిచెప్పారు. బుధవారం తెల్లవారుజామున మళ్లీ గొడవ జరగడంతో గౌరీప్రియ తన కూతురిని ఎత్తుకొని పక్కనే ఉన్న బావిలో దూకింది. రైతులకు బావిలో నుంచి అరుపులు విని బయటకు తీయగా అప్పటికే చిన్నారి చనిపోగా, గౌరీప్రియను జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహాశివరాత్రి పండుగ నాడే చిన్నారి చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జనగామలో పది నెలల పాప కిడ్నాప్

ఖమ్మం జిల్లాకు చెందిన నిందితులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 26: జనగామలో 10 నెలల పాప కిడ్నాప్ కలకలం సృష్టించింది. అర్బన్